# వల కౌగిలి

## - విహారి




ఆదివారం, మధ్యాహ్నం మూడు దాటింది. ఒక కునుకు తీసి అప్పుడే లేచాను.

సుడిగాలిలావచ్చాడు రాజు. ముకుందం వాళ్ల ఇంట్లో అద్దెకున్న టీచరు కొడుకు. పన్నెండేళ్లవాడు-రాజు.

ఉన్నఫళాన రమ్మని కబురుపెట్టాడు ముకుందం. హడావిడిగా ముకుందం వాళ్ల ఇంటికి వెళ్లాను. మా పక్క ఇల్లే వాళ్లది. నా వెనుక మా అవిడ-శారద- వచ్చింది.

నే వెళ్లేసరికి -రణరంగం మధ్యలో వున్నారు తండ్రీకొడుకు. గదిలో ఒ మూలగా భయంతో ఒణికిపోతూ ఒదిగిపోయి కూర్చొనివున్నాడు ముకుందం. రామ్మూర్తి చేతిలో వెదురుకత్తి. కొడుకు కాళ్లు చేతులు పట్టుకొని ప్రాధేయపడుతూ ఏడుస్తోంది వర్ధనమ్మ. వీళ్ల ప్రక్కగా తలుపుచాటున సరోజ పిల్లని ఎత్తుకొని బిక్క చూపులు చూస్తూ వెక్కులు పెడుతూంది. సరోజ రామ్మూర్తి భార్య. ముకుందం వర్ధనమ్మల కోడలు.

నన్నుచూస్తూనేబావురుమంటూ 'రక్షించండి శేఖరంగారూ' అంటూ నెత్తినోరు కొట్టుకోసాగాడు ముకుందం. నాకు పరిస్థితి అర్థమైంది.

ఒక్క ఉదుటున రామ్మూర్తి చేతిలో కత్తిని లాక్కుని అతన్ని పక్కకి త్రోసేశాను.

'ఇవాళ అటో ఇటో తేలిపోవాల్సిందే. వీడో నేనో ఎవరో ఒకళ్లం చావాల్సిందే. లం. ..కు' అంటూ గోడవారగా వున్న మంచం మీద కూలబడ్డాడు రామ్మూర్తి.

అప్పటికప్పుడే వర్ధనమ్మ చెయ్యిపట్టుకొని పక్కకి తీసుకెళ్లి కూర్చోబెట్టింది మా శారద.

"చూశారా...చూశారా ఎంతమాటం

టున్నాడో విన్నారు గదా. నీ నోట్లో నిప్పులుపొయ్య, పురుగులు పడి చస్తావురా నీచుడా" ముకుందం లేచి తుండుతో ముఖం తుడుచుకున్నాడు.

"నోరు మూసుకు కూర్చో. మాట్లా డావంటే తలకాయ పగులుతుంది."

నేను వినలేకపోయాను.

వున్నట్టుండి -"ఏయ్ రామ్మూర్తి కమాన్. లే లేచి నాకు కొంచెం టీ పెట్టు. ముందు నేను టీ తాగాలి. ఇంట్లో తాగబోతూ వుంటే మీ కబురు వచ్చింది." అంటూ వంటింట్లోకి నడిచాను. నా వెనగ్గా మంత్రముగ్ధుడిలా రామ్మూర్తి వచ్చాడు. వాతావరణం చల్లబడింది.

టీ త్రాగుతూ మంచం మీద కూర్చున్నాను. రామ్మూర్తి టీ తాగుతున్నాడు. ముకుందంకీ ఓ కప్పు అందించాను. ఆడవాళ్లు ముగ్గురు వంటింటి గుమ్మంలో కూర్చున్నారు.

క్షణాల తర్వాత నేనే కదిపాను. "ఏవిటోయ్ రామ్మూర్తీ, చదువుకున్నవాడివి. ..ఇలా ..."

ఒక నిమిషంసేపు దిక్కులు చూశాడు రామ్మూర్తి. ఆ వెంటనే అన్నాడు "మా ఇంటి విషయాలు మీకు తెలుస్తూనే వుండి వుంటాయి. కనుక, నన్నేమి వివరాలు అడగొద్దు. ఇక ఇవాల్టి రచ్చ అంటారా? ఈ దర్టీరోగు నన్ను, నా పెళ్లాన్ని ఇంట్లో నుంచి బయటకి పొమ్మంటున్నాడు. కొంప అమ్మేసి నా భాగం నాకిచ్చేయమనండి" రామ్మూర్తి స్వరంలో కసి, కోపం.

"ఎందుకూ -ఆ నాలుగురాళ్లు తగలేసి బొచ్చె పుచ్చుకుపోదామనా? అడగండి

# కలకానిది...

శేఖరంగారూ"- ముకుందం. "అయినా ఈ ఆస్తిలో ఏ ముండమోపికి భాగాల్లేవు."

"ఆ మాటే అనకు. ఎలా వుండదో మేము చూస్తాం. ఇక్కడ ఎవరూ గాజులు తొడిగిచ్చుక్కూర్చోలేదు" రామ్మూర్తి.

"ఏవోయ్ నీ విసురు మా మీదకి రానియ్యకు. నేనసలే మంచిదాన్నికాదు" నవ్వుతూ అన్నది శారద. సరోజ కూడా సన్నగా నవ్వుకుంది.


మరికొద్దిసేపటికి- మార్కెట్ దాకా వెళ్లొద్దాం పదమని ముకుందంని బయటికి తీసుకొచ్చాను. ఇద్దరమూ మా ఇంటికొచ్చి కూర్చున్నాం. నిజానికి నాకు మార్కెట్లో పనేమీలేదు. యుద్ధ వాతావరణం నుంచీ తప్పిద్దామనే అతన్నిలా బయట పడేశాను.

ఛెస్‌బోర్డ్ తీశాను. నా ఎదురుగా కుర్చీలో కూర్చున్నాడు ముకుందం.

"వీడి పరిస్థితి శ్రుతిమించి రాగాన పడుతోంది- శేఖరంగారూ, మీకు తెలుసుగదా విషయాలన్నీ." చేతిలోని దినపత్రికని తిరగేస్తూ సాలోచనగా అన్నాడు ముకుందం, "ఏమీ బాగాలేదు".

అవును. నాకు కొంతవరకూ తెలుసు. కొడుకుతో తాము పడుతున్న అవస్థలన్నీ అడపాదడపా శారదకి చెప్పుకుంటూ వుంటుంది వర్ధనమ్మ. తద్వారా నేనూ విన్నాను.

ముకుందం వర్ధనమ్మలకి రామ్మూర్తి ఒక్కడే కొడుకు. గారాబంగా పెంచి పెద్ద చేశారు. గ్రాడ్యుయేషన్ కాగానే-




ముకుందం తన పలుకుబడితో ఏదో కంపెనీలో ఉద్యోగంలో చేర్చాడు రామ్మూర్తిని.

ముకుందం డైరెక్టర్‌కి పి.ఏ.గా చేసి రిటైరయ్యాడు. అంతో ఇంతో వున్న వాడి క్రిందే లెక్క. పాతికేళ్ల క్రితం ఈ ఇల్లు కట్టుకున్నాడు. సర్వీసులో వుండగా కంపెనీకి ఎంతో విశ్వాసంగా సేవచేశాడు. ఆ మంచితనంతోనే నిజానికి రామ్మూర్తికి వుద్యోగం దొరికింది. ఉద్యోగంలో చేరిన ఆర్నెల్లకే అతనికి సరోజతో వివాహం జరిగింది. ఆ పెళ్లికి ముందు జరిగిన రభసలూ, రాద్ధాంతాలు కూడా చూచాయగా తెలుసు నాకు. సరోజది శాఖాంతరమని ముకుందం వొప్పుకోలేదు. రామ్మూర్తి సరోజనే చేసుకుంటానని మొరాయించుక్కూర్చున్నాడు. చివరికి సరోజ తల్లిదండ్రులు కట్న కానుకలు అధికంగానే యివ్వజూపారని, ఆ కారణాన ముకుందం పంతాలూ పట్టింపులూ సడలినాయనీ చెప్పుకున్నారు.

పెళ్లయిన మూడు నాలుగు నెలల నుంచీ- ఏ రాత్రీ ఆ యిల్లు ప్రశాంతంగా నిద్రపోలేదు. రామ్మూర్తికి అన్ని వ్యసనాలూ అబ్బినై. క్లబ్బుల్లో పేకాట, చెడు తిరుగుళ్లు, తాగుడూ నిత్యకృత్యాలైనై. సరోజ పురిటికి వెళ్లి వచ్చింది. ఆ తర్వాత, ఈ రెండేళ్లలోనూ మనిషి పూర్తిగా చెడిపోయాడు రామ్మూర్తి, క్రమంగా- ఆఫీసుకు వెళ్లకపోవడంతో- వుద్యోగమూ వూడింది.

అయితే, గుడ్డిలోమెల్ల అన్నట్టు సరోజకు బ్యాంకు వుద్యోగం వచ్చింది. అప్పట్నుంచీ ఆమె సంపాదనని తన వ్యసనాలకి తగలేయడం నిత్యకృత్యమైంది- రామ్మూర్తికి. కుమ్మరి ఆవంలో కంకర్రాయిలా తగులుకున్నాడు- రామ్మూర్తి!

ఆ వేళ-

నేను ఆఫీసు నుంచీ వచ్చి వోవర్ హెడ్ ట్యాంక్‌కి నీళ్ళు పంప్ చేయడానికి మోటార్ వేస్తున్నాను. అదిగో అప్పుడు ఇలాగే ఈ రాజుగాడే పరుగెత్తుకొచ్చాడు. నే వెళ్లేసరికి రామ్మూర్తి కడుపులో నెప్పితో మెలికలు తిరిగిపోతున్నాడు. ముకుందమూ, వర్ధనమ్మ ఏదో పెళ్లికి వెళ్లారుట. అతని బాధ చూసి సరోజ కళ్ల నీళ్లు పెట్టుకుంది. నేను ఆటోపిలిపించి రామ్మూర్తిని డాక్టర్ దగ్గరికి తీసుకుపోయాను. సరోజా వచ్చింది.

వెళ్లగానే ఇంజక్షనిచ్చాడు డాక్టర్. లివర్ దెబ్బతింటోందని బీ.పి. చాలా

ఎక్కువగా వుందనీ, సిగరెట్లు తాగుడూ మానకపోతే కష్టమనీ చెప్పి ఏదో మందులు రాసిచ్చాడు, డాక్టర్. ఆ మందులు తీసుకు వచ్చాం. నేను చెప్పాల్సిన జాగ్రత్తలు చెప్పి వచ్చాను.

ఆ తర్వాత నాలుగు రోజులకి ముకుందం మా ఇంటికి వచ్చి ప్రత్యేకంగా నాకు కృతజ్ఞతలు చెప్పి వెళ్లాడు.

"నన్నేం చెయ్యమంటారో సలహా యివ్వండి." ముకుందం మాటలతో ప్రస్తుతంలోకి వచ్చాను. ఈ పరిస్థితుల్లో నేనుగా ఏం సలహా ఇవ్వాలో తోచలేదు. "చూద్దాంకానీయండి" అని వూరుకున్నాను. ఇంతలో శారద టిఫిన్ కాఫీలతో వచ్చింది.

ఇల్లూ వొళ్లూ ఎలా గుల్లయిపోతున్నదీ, కొడుకుతో తాము ఎలాంటి అవస్థలు పడుతున్నదీ-వివరంగా చెప్తూ చాలాసేపు కూర్చున్నాడు ముకుందం. ఆరు అవుతుండగా తన యింటికి వెళ్లాడు.

రాత్రి ఎనిమిదిముప్పావు. నేను హిందీ వార్తలు వింటూ టీవీ ముందు కూర్చున్నాను. శారద వంటింట్లో ఏదో చేస్తోంది. పక్కయింట్లో పెద్దగా గావుకేకలు, పెడబొబ్బలూ వినిపించినై. లేచి, త్వరత్వరగా ముకుందం ఇంటికి వెళ్లాను. ఇంటి ముందు కాంపౌండ్‌లో చుట్టుపక్కల వాళ్లు పదిమంది దాకా చేరేరు. వాళ్లను తట్టుకుంటూ నేను లోపలికి నడిచాను. మర్యాదా మన్ననా లేకుండా తల్లినీ, తండ్రినీ, పెళ్లాన్నీ-కలగా పులగంగా తిడుతున్నాడు రామ్మూర్తి, బలవంతంగా ఇద్దర్నీ విడదీశాను.

ఏడుస్తూ చెప్పింది వర్ధనమ్మ. "కత్తిపీట తీసుకుని తండ్రిని కొట్టబోయాట్ట రామ్మూర్తి. ఇంతకుముందు కత్తిపీటతో ఆత్మహత్య చేసుకుంటానని గది తలుపులు బిగించుకుని మొరాయించుక్కూర్చున్నాట్ట- రామ్మూర్తి. తలుపులు బద్దలుకొట్టి లోపలి కొడుకుని బయటికి లాక్కొచ్చాడట ముకుందం. నన్ను చావనీయకపోతే, నిన్నే చంపుతానని ఎదురు తిరిగాడట రామ్మూర్తి."

నాకు చాలా చిరాకు వేసింది. అతని ప్రవర్తనకు అసహ్యమూ కలిగింది. ఇంతలో ఎవరో అన్నారు, "పోలీసుల్ని పిలిచి కేసు పెట్టిస్తేసరి -ఇరుగు పొరుగు వాళ్లని ప్రశాంతంగా బ్రతకనీయడంలేద"ని.

నావైపు చూశాడు ముకుందం-రామ్మూర్తిలో ఏమీ చలనం లేదు. తుమ్మమొద్దులా ఓ ప్రక్కన కూర్చుని సిగరెట్ వెలిగించుకున్నాడు. చుట్టూ చేరిన వాళ్లకి సర్దిచెప్పి అందర్నీ పంపించేశాను. నేనూ ఏమీ మాట్లాడకుండా మా యింటికి వచ్చేశాను.

ఆరాత్రి చాలా ప్రొద్దుపోయిన తర్వాత -పిల్లని చంకనేసుకుని మా యింటికి వచ్చింది సరోజ. భర్త ప్రవర్తనకి కళ్లనీళ్లు పెట్టుకుంది. శారదా, నేనూ అనునయింపు మాటలు చెప్పాం.

ఉన్నట్టుండి, లేచి నా చేతులు పట్టుకుంది సరోజ. నేను ఉలిక్కిపడ్డాను.

"ఆయన మనసు చాలామంచిది బాబాయిగారూ, ఏదో ఒకటి చేసి నాభర్తని నాకు దక్కించండి. పంతానికి పోయి ఏ క్షణాన్న ఏ అఘాయిత్యం చేస్తారోనని భయంగా వుంది." ఏడుపు ఆపుకోలేక పోయింది సరోజ.

కన్ను అదిరింది, గుండె దడదడలాడింది నాకు. క్షణాల్లో నన్నునేను సంబాళించుకున్నాను. నిబ్బరంగా సరోజ భుజం తట్టి "పిచ్చిపిల్ల ఊరుకో, ఏంఫర్వాలేదు" అని కూర్చోబెట్టాను.

మరో అరగంట తర్వాత సరోజ వెళుతుండగా -హఠాత్తుగా నాకు ఖాశిం గుర్తు



## "రూప్‌కీ రాణితో యిక్కట్లు"

నిర్మాతలు ఈ మధ్య శ్రీదేవి మూలంగా కొన్ని యిబ్బందులు ఎదుర్కొంటున్నారు. బోనీకపూర్ నిర్మిస్తున్న 'రూప్ కి రాణి' నిర్మాణం ఆగిపోయింది. ఒక పాట చిత్రీకరణకు శ్రీదేవికి వీలు కుదరక పోవటమే యిందుకు కారణమట. ఇప్పటికే ఈ చిత్ర నిర్మాణానికి రెండున్నర సంవత్సరాలు పట్టింది. ఇంకెంత కాలం పడుతుందో అని కాబోలు ఆ నిర్మాత భయం. యాష్ చోప్రా నిర్మిస్తున్న 'లంహే' చిత్రానికి ఎక్కువ డేట్స్ యివ్వాలని శ్రీదేవి నిర్ణయించుకుంది. కాని రాజన్‌సిప్పీ నిర్మిస్తున్న . 'హరాజ్' కు మద్రాసు తిరిగి వెళ్ళిపోయే విధంగాడేట్స్ యిచ్చింది. బొంబాయిలో నే వుండమని ఆ నిర్మాత ఎయిర్ టికెట్స్ కూడా పంపాడట. దానికి శ్రీదేవి ఏం సమాధానం చెప్పిందో?

కొచ్చాడు. ఆశారేఖ తోచినట్లైంది.

మర్నాడు ఉదయాన్నే రామ్మూర్తిని ఖాశిం దగ్గరకు తీసుకువెళ్లాను. తన కథంతా పూసగుచ్చినట్లు చెప్పుకొచ్చాడు ఖాశిం. తిరిగి వచ్చేటప్పుడు నోరు మెదప కుండా తన ఆలోచనల్లో తానుగా వచ్చేశాడు రామ్మూర్తి.

నాలుగురోజుల తర్వాత, వో సందె వేళ-

రామ్మూర్తీ, సరోజా పిల్లతో మా యింటికి వచ్చారు. ఇద్దరి మొహాల్లోనూ కొత్తకళ తొణికిసలాడుతోంది. శారద కాఫీ ఇచ్చింది. ఆ తర్వాత నెమ్మదిగా చెప్పింది సరోజ, "మరో ఫ్రెండ్‌తో కలిసి చిన్న టైలరింగ్ షాప్ ప్రారంభిస్తున్నారు బాబాయిగారూ, మీ ఆశీస్సులు కావాలి."

నాకు చాలా ఆనందం కలిగింది. "చాలాసంతోషం, మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు అందిస్తున్నాను రామ్మూర్తీ. విష్‌యూ ఆల్ దిబెస్ట్ ఆఫ్ లక్."

రామ్మూర్తి కరచాలనం చేశాడు. ఆ వెంటనే సరోజే అంది, "మేమిద్దరమూ మరో నిశ్చయానికి కూడా వచ్చాం. మాకు మీ ఇంట్లో రెండు గదులు అద్దెకి కావాలి."



"అవును, మీరు మాకీ హెల్ప్ చేయాలి" రామ్మూర్తి అన్నాడు.

నేనూ శారదా వొకరి నొకరం చూసుకున్నాం. శారద అన్నది," దానికేం భాగ్యం, రేపే సర్దించి సిద్ధంచేయిస్తాను. ఉన్న ఒక్కగానొక్క కూతురు ఎలాగూ అమెరికాలో వుంది. లక్ష్మీదేవిలాగా నీలాంటి ఆడపిల్ల ఇంట్లో తిరుగుతూ వుండటం కంటే అదృష్టం ఏముంది. సంతోషంగా వచ్చి చేరండి."

ముకుందం ఏమనుకుంటాడో అని అనిపించింది నాకు. కానీ, పరిస్థితులు చక్కబడేదాకా ఇలా కొనసాగనిస్తేనే బాగుంటుం దంటే అతను మాత్రం ఏమంటాడు? అభ్యంతరం పెట్టడనే అనుకున్నాను.

నా ఆలోచనల్లో రామ్మూర్తి సరోజలు వెళ్లిపోవడం గమనించలేదు నేను. నా మనసునిండా నిండిపోయాడు ఖాశిం. ఇంట్లో భాగాన్నీ, సుక్షేత్రం లాంటి పదెకరాల జామతోటనీ పెద్ద సంసారమని అన్నకిచ్చేసి, పట్నంచేరి పళ్లదుకాణం తెరిచి తన కాళ్లమీద తను నిలబడిన ఖాశిం. వయసు తెచ్చిన వ్యసనాలనుంచీ కూడా బయటపడి 'మనిషి'గా నిలదొక్కుకున్న వ్యక్తి ఖాశిం.

తన కథ అంతా చెప్పిన తర్వాత రామ్మూర్తితో ఆరోజు అతనన్న మాటలూ గుర్తు కొచ్చినై నాకు. "బతికేది నాలుగు రోజులు భాయ్, వయస్సు క్షణక్షణానికీ తరిగిపోతోంది. ఈ నాలుగు రోజులూ మనం ఏడుస్తూ-మన వాళ్లని ఏడిపిస్తూ గడపడం కంటే, మనం నవ్వుతూ మన తోటివాళ్లని నవ్విస్తూ గడపడం మేలుగదా. ఆలోచించు...అనుభవం మీద జ్ఞానోదయం అయింది నాకు. నా అనుభవం నీకు ఉపయోగించి, నువ్ నడుస్తున్న దారిని మార్చ గలిగితే చాలా సంతోషిస్తాను. ఓకే."

ఖాశిం మాటలు రామ్మూర్తి మీద ఇంతటి ప్రభావాన్ని చూపడం నిజంగా 'మనిషి'మీద నాకున్న విశ్వాసానికితార్కాణం!

అవును, అందుకనే, తుంచకుండా విడివడింది పీటముడి!! ఇప్పుడు-

మా యింట్లో బోసినవ్వులూ, పండు వెన్నెలలూ పండుతున్నాయ్.

ముకుందం ఇల్లుప్రశాంతంగా వుంటోంది!

*

